సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. తాజాగా శనివారం జిల్లాలో పార్టీలో పలు కుటుంబాలు చేరాయి. -8లో



బాబు మాటలను జనం నమ్మరు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసపు మాటలను జనం నమ్మే పరిస్థితిలో లేరని వైఎస్సార్‌సీపీ నేత గంటా నరహరి అన్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.120	రూ.160
రెండోరకం	రూ.70	రూ.116

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 194 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	320	505
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 855.780 కిలోలు

న్యూస్‌రీల్

గండి శాశ్వత నిత్యాన్నదానానికి లక్ష వితరణ



దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి

చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రు.1,00,500లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం రామసముద్రానికి చెందిన పోలి గంగయ్య, కనకమ్మ కుటుంబీకులు విరాళం అందజేశారని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ చేర్మెన్ కావలి కృష్ణ తేజ, ఆలయ ప్రధాన ఉప ప్రదాన,ముఖ్య అర్చకులు పాల్గొన్నారు.

నేడు ఇంటాక్ వారసత్వ పర్యటన

కడప కల్చరల్: ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని ఈనెల 18న నిర్వహించుకుంటున్న నేపథ్యంలో భారత జాతీయ కళా సంస్కృతి, వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) ముందస్తుగా జిల్లాలోని ప్రముఖ వారసత్వ ప్రాంతమైన పుష్పగిరి తీర్థ క్షేత్ర పర్యటన నిర్వహించనుందని కన్వీనర్ లయన్ కె.చిన్నప రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు ఎర్రముక్కపల్లెలోని సంస్థ కార్యాలయం వద్ద నుంచి ప్రత్యేకంగా సంస్థ సభ్యుల కోసం ఇంటాక్ సభ్యులు కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి (నాని), మరో సభ్యులు మయూర నవీన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని ఆకాశవాణి కడప కేంద్రం ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు ఆయన వివరించారు.

18న ఆకేపాటి నామినేషన్



నాయకులతో భేటీ అయిన ఆకేపాటి అనిల్‌రెడ్డి

రాజంపేట: రాజంపేట వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం ఈనెల 18న ఉంటుందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి వెల్లడించారు. శనివారం నందలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పలువురు నాయకులతో ఆయన భేటి అయ్యారు. ఈసందర్బంగా మాట్లాడుతూ నామినేషన్ కార్యక్రమంలో భాగంగా మన్నూరు యల్లమ్మ గుడి నుంచి ఉదయం 9గంటలకు ర్యాలీగా ఆర్వో కార్యాలయాలనికి బయలుదేరనున్నట్లు చెప్పారు. ఆకేపాటి నామినేషన్ కార్యక్రమానికి భారీగా తరలివచ్చి ఆయనను ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ గడికోట ఉషా సుబ్బారెడ్డి, సౌమ్యనాథాలయం మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, అరిగెసోదరులు హరిబాబు, అరిగెమణి, అసెంబ్లీ జెసీఎస్ ఇన్‌చార్జి నడివీధి సుధాకర్, జిల్లా ఎస్సీసెల్ నేత వేల్పుల శైలకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, విజయుడు, బీసీ నేత ఆనాల మధుయాదవ్. మైనార్టీ నాయకులు జాఫర్‌బేగ్, ఇలియాస్, ఇబ్బు, మాబాషా, కామాక్షయ్య, ఆకులశంకర్ పాల్గొన్నారు.

పేటలో అరుదైన పోటీ

- ఆరుదశాబ్దాల తర్వాత ఒకే సామాజిక వర్గం నేతల మధ్య పోరు
- కూటమి నుంచి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ మిథున్‌రెడ్డి
- రెండుసార్లు దిగ్గజాలను మట్టి కరిపించిన మిథున్‌రెడ్డి
- ఆసక్తికరంగా రాజంపేట లోక్‌సభ రాజకీయం

రాజంపేట: రాజంపేట లోక్‌సభకు అరుదైనపోరు ఆవిర్భవించింది. ఆరుదశాబ్దాల తర్వాత ఏక సామాజికవర్గం మధ్య లోక్‌సభ ఎన్నికల రణరంగానికి రాజంపేట వేదికగా మారింది. ఈ లోక్‌సభపై రాష్ట్రం దృష్టి సారించింది. కారణం కూటమి అభ్యర్థిగా, బీజేపీ నుంచి ఉమ్మడిరాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీచేస్తుండగా, ఈ స్థానం నుంచి రెండుసార్లు ఎంపీ అయిన పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నుంచి బరిలోకి దిగారు. ఇప్పటి వరకు రాజంపేట లోక్‌సభకు బలిజ,రెడ్డి సామాజికవర్గాలకు చెందిన అభ్యర్థుల మధ్య పోటీ కొనసాగుతూ వచ్చింది. ఈ సారి ఇద్దరు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే లోక్‌సభ ఎన్నికబరిలో ఉండటంతో అరుదైన పోరుగా రాజకీయపరిశీలకులు భావిస్తున్నారు.

1957 నుంచి...

రాజంపేట లోక్‌సభ ఆవిర్భవించిన తర్వాత 1957 నుంచి 2019 వరకు 16 సార్లు జరిగిన ఎన్నికల్లో మొదటి రెండు, చివరి రెండుసార్లు మినహా మొత్తం 12 సార్లు కాపు (బలిజ)లే దక్కించుకున్నారు.ఈ నేపథ్యంలో ప్రధాన అభ్యర్థులుగా ఇద్దరు ఒకే సామాజికవర్గానికి వారు తలపడి 62 సంవత్సరాలు అయింది.

1962 తర్వాత..

2019 ఎన్నికల్లో బలిజ సామాజికవర్గానికి చెందిన ఆదికేశవులనాయుడు సతీమణి సత్యప్రభతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి తలపడి గెలుపొందారు. 2014లోనూ బీజేపీ అభ్యర్థి, ప్రస్తుత బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై పోటీ చేసి గెలుపొందడం విశేషం. 1962 తర్వాత ఒకే సామాజికవర్గానికి చెందిన అభ్యర్థుల మధ్య పోరు 2024 ఎన్నికల్లో ఆవిష్కృతంకావడంతో రాజంపేట లోక్‌సభ స్థానం ప్రత్యేకతను సంతరించుకుంది. బహుశా రాష్ట్రంలో కూడా రెండు ప్రధాన పార్టీల నుంచి ఒకే సామాజికవర్గం వారు పోటీ పడిన సందర్భం ఎక్కడా ఉండకపోవచ్చు.



9 సార్లు కాపుల మధ్యే పోరు

రాజంపేట లోక్‌సభ ఏర్పడిన 1957 నుంచి 2019 వరకు ఎన్నికల చరిత్రలోకి వెళితే...ఇప్పటికి 16సార్లు ఎన్నికలు జరిగాయి. తొలి ఎన్నికల్లో 1957లో టీవీఎస్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కాగా , 1962లో ఇండిపెండెట్‌గా సీఎల్‌రెడ్డి చేతిలో టీవీఎల్‌ఎస్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమిపాలయ్యారు. అంటే 1962లో ఇద్దరు ఒకే సామాజికవర్గ అభ్యర్థుల మధ్య పోరు జరిగింది.



తర్వాత ఈ వర్గానికి మధ్య ఇప్పటి వరకు పోరు జరగలేదు. 1967లో బలిజ సామాజికవర్గానికి చెందిన పార్థసారధి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పట్లో ఆయనపై సీఎల్ఎస్‌రెడ్డి స్వతంత్ర్యఅభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 1971లో కాంగ్రెస్ అభ్యర్థిగా తిరిగి పోటీ చేసిన పార్థసారధిపై,ఎన్‌సీవో పార్టీ అభ్యర్థిగా యశోదరెడ్డి పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 1977లో మూడోసారి కాంగ్రెస్ అభ్యర్థిగా పార్థసారధి, బీఎల్‌డీ అభ్యర్థి తిమ్మారెడ్డి పై పోటీ చేసి గెలుపొందారు. 1980లో నాలుగోసారి పార్థసారధి కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా పోటీచేశారు. ఈ సారి బలిజ సామాజికవర్గానికి చెందిన కాంగ్రెస్ (యు) అభ్యర్థిగా ఆర్.సభాపతిపై పోటీ చేసి గెలుపొందారు. బలిజసామాజికవర్గానికి చెందిన 1984లో పాలకొండ్రాయుడు టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కాంగ్రెస్ అభ్యర్థి సాయిప్రతాప్ గెలుపొందారు. 1989లో సాయిప్రతాప్, టీడీపీ నుంచి పోటీ చేసిన సీ.రామచంద్రయ్యపై గెలుపొందారు. 1991లో సాయిప్రతాప్ కాంగ్రెస్ నుంచి పోటీ చేయగా, పాలకొండ్రాయుడు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 1996లో సాయిప్రతాప్ కాంగ్రెస్ అభ్యర్థిగా , టీడీపీ అభ్యర్థి పోతురాజు ప్రతాప్‌పై పోటీ చేసి గెలుపొందారు. 1998లో టీడీపీ అభ్యర్థి గునిపాటి రామయ్యపై కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 1999లో గునిపాటి గెలుపొందారు. అంటే 1977 నుంచి 2004 వరకు జరిగిన తొమ్మిది ఎన్నికల్లో బలిజసామాజికవర్గం అభ్యర్థుల మధ్య పోటీ సాగింది.

నాలుగుసార్లే...

2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సాయిప్రతాప్ టీడీపీ అభ్యర్థి రమేష్‌రెడ్డిపై పోటీ చేసి గెలుపొందారు. 2014లో ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసి ,బీజేపీ అభ్యర్థి పురందేశ్వరిపై గెలుపొందారు. 2019లో మిథున్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా టీడీపీ అభ్యర్థి సత్యప్రభపై పోటీ చేసి గెలుపొందారు. అంటే మొత్తం 67 నుంచి జరిగిన ఎన్నికల్లో నాలుగుసార్లు రెడ్డి, బలిజ అభ్యర్థుల మధ్య పోటీ జరగ్గా , మిగతా అన్నిసార్లు బలిజ,బలిజల మధ్యే ఎన్నికల పోరు కొనసాగింది.

లోక్‌సభ స్వరూపమిలా..

ఏపీలోని 25 లోక్‌సభ నియోజకవర్గాల్లో రాజంపేట ఒకటి. ఈ నియోజకవర్గ పరిధి ఆధారంగా అన్నమయ్య జిల్లాను ఏర్పాటుచేశారు. ఇందులో ఏడు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో పుంగనూరు నియోజకవర్గం జిల్లాకేంద్రానికి దగ్గరగా ఉండటానికి చిత్తూరు జిల్లాలో కలిపారు.

▶▶ మిథున్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి మధ్య పోరు...

రాజంపేట సిట్టింగ్ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి, మాజీ సీఎం నలారి కిరణ్‌కుమార్‌రెడ్డి మధ్య పోరు సాగుతోంది.1962లో జరిగిన ఎన్నికల్లో తప్ప ఇప్పటి వరకు రెడ్డి, రెడ్డి మధ్య జరగని పోరు ఈ సారి ఎన్నికల్లో ఆవిష్కృతం కావడంతో రాజంపేట పార్లమెంట్ పోరు అరుదైన ఘట్టంగా మారిందని రాజకీయపరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

పార్లమెంటు నియోజకవర్గం: రాజంపేట

ఓటర్లు: 16,39,605

నియోజకవర్గాలు: 7

అన్నమయ్యజిల్లా: 6

చిత్తూరు జిల్లా: 1



సంఖ్య	నియోజకవర్గం	జిల్లా
125	రాజంపేట	అన్నమయ్య
127	కోడూరు (ఎస్సీ)	అన్నమయ్య
128	రాయచోటి	అన్నమయ్య
162	తంబళ్లపల్లె	అన్నమయ్య
163	పీలేరు	అన్నమయ్య
164	మదనపల్లె	అన్నమయ్య
165	పుంగనూరు	చిత్తూరు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు
రాజంపేట	2,37,112
రాయచోటి	2,49,315
కోడూరు	2,01,114
పీలేరు	2,32,631
మదనపల్లె	2,60,009
పుంగనూరు	2,38,236
తంబళ్లపల్లె	2,21,146

గత రెండుసార్లు ఎన్నికల ఫలితాలిలా..

పార్టీ	అభ్యర్థి	ఓట్లు	శాతం
2014..			
వైఎస్సార్‌సీపీ	మిథున్‌రెడ్డి	601752	51.95
బీజేపీ	పురందేశ్వరి	426990	36.85
2019..			
వైఎస్సార్‌సీపీ	మిథున్‌రెడ్డి	702211	57.35
టీడీపీ	సత్యప్రభ	433927	35.44

ఒంటిమిట్ట రామయ్య కల్యాణోత్సవాలు ప్రారంభం





పసుపు కొమ్ములను దంచుతున్న అధికారులు, అర్చకులు, సీతారాముల ఉత్సవ విగ్రహాలకు పసుపుతో అభిషేకం

ఒంటిమిట్ట/తిరుపతి: వైఎస్ఆర్ కడప జిల్లా ఒంటిమిట్టలోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు శనివారం 'హరిద్రా ఘటనం'తో అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది తొలిసారిగా టీటీడీ ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా మహిళా భక్తులు సుమారు మూడు కిలోల పసుపును పోసి జై శ్రీరామ్ అంటూ స్మరిస్తూ సంప్రదాయబద్ధంగా రోలులో దంచారు. అంతకుముందు గర్భాలయం లోపల పసుపు కొమ్ములకు, రోకళ్లకు స్వామి పాదాల చెంత ప్రత్యేక పూజలను చేశారు. అర్చకులు శ్రవణ స్వామి మాట్లాడుతూ భగవత్ విజ్ఞాపనతో హరిద్రా ఘటనం కార్యక్రమం ప్రారంభమైందన్నారు. దీంతో శ్రీ సీతా రామ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లకు నాంది పలికినట్లు అయిందన్నారు. పసుపు దంచే కార్యక్రమంలో వచ్చిన పసుపును ఉత్సవర్లకు కల్యాణం నాడు నిర్వహించే స్నపనం . తలంబ్రాలు తయారీకి ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు రాఘవాచార్యులు, ఒంటిమిట్ట ప్రత్యేకాధికారిణి ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఏపీఆర్‌వో నీలిమ, అర్చకులు మనోజ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

పట్టాభిరాముడి సేవలో హనుమ

వైభవంగా ముత్యపుపందిరి వాహనం

వాల్మీకిపురం: సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం సీతాసమేత శ్రీ పట్టాభిరాముడు తన ప్రియభక్తుడైన హనుమంతునిపై పురవీధుల్లో ఊరేగుతూ.. భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, పంచాంగ శ్రవణం, అర్చన అనంతరం ఉదయం 8గంటలకు స్వామి వారు ముత్యపుపందిరి వాహనంపై పురవీధుల్లో విహరించారు. ఉదయం 10గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల మండపంలో ఊంజల్ సేవ నయనానందకరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమంతవాహనసేవ

సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి 8గంటలకు ఉత్సవర్లను పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, సుగంధ పుష్పాలతో నయనానంధకరంగా అలంకరించి హనుమంత వాహనంపై స్వామివారు తిరుమాడవీధుల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు. మహిళలు హనుమంత వాహనంపై విహరిస్తున్న స్వామివారికి నేతి దీపాలతో తిరుమాడ వీధుల్లో స్వాగతం పలికారు. టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటాలు, చెక్కభజనలు, మంగళ వాయిద్యాల భక్తులను ఆకట్టుకుంది.



హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో ఆదివారం ఉదయం 8గంటలకు కల్పవృక్ష వాహనం, రాత్రి 8గంటలకు సింహ వాహన సేవ.

టీడీపీకి అచ్చిరాని తంబళ్లపల్లె!

- ఎన్టీఆర్ ప్రభంజనంలో 1983లో ఘోర ఓటమి
- 1999, 2004లో పోటీకి టీడీపీ దూరం
- లక్ష్మిదేవమ్మ తప్ప మరొకరు రెండోసారి గెలవని వైనం
- టీడీపీలో అవమానకరంగా ముగిసిన శంకర్ శకం

బి.కొత్తకోట: తెలుగుదేశం పార్టీకి తంబళ్లపల్లె అచ్చిరావడం లేదా.. పోటీచేసిన నేతలకు కష్టాలు తప్పవా?. రాజకీయ భవిష్యత్తు అంధకారం అవుతుందా? జరిగిన ఘటనలు, జరుగుతున్న పరిస్థితులను పరిశీలిస్తే అవుననే చెప్పాలి. టీడీపీ టికెట్‌పై పోటీ చేశాక ఎవరి భవిష్యత్త ఎలా ఉంటుందో చెప్పలేని పరిస్తితి. టీడీపీ చరిత్రలో అనిపిరెడ్డి కుటుంబం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, పార్టీ జిల్లా సారధ్య బాధ్యతలను నిర్వర్తించింది. పార్టీకి గట్టి పునాదులు వేసింది. ప్రస్తుతం ఈ కుటుంబం రాజకీయాలకు దూరమైంది. బీసీ నేత శంకర్‌ను టీడీపీలోకి రప్పించుకుని వాడుకున్నఅధిష్టానం గెంటేసినంత పనిచేసింది. కొత్త వ్యక్తికి టికెట్ ప్రకటించిన చంద్రబాబు, ఆ వ్యక్తి ప్రచారంలో ఉండగానే పొత్తులో తంబళ్లపల్లెను బీజేపీకి ఇచ్చేందుకు టీడీపీ సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం పార్టీ నేతల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిస్థితుల్లో తంబళ్లపల్లెలో టీడీపీ తరపున పనిచేయాలంటే భయపడే పరిస్థితి నెలకొంది.

ఎన్టీఆర్ ప్రభంజనంలో పరాజయం

1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం సమయంలో జరిగిన ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రభంజనం సృష్టించాయనే చెప్పొచ్చు. అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 14 నియోజకవర్గాల్లో టీడీపీ గెలవగా తంబళ్లపల్లెలో పరాజయం పాలైంది. ఆ ఎన్నికలో టీడీపీ అభ్యర్థిగా ఏవీ ఉమాశంకర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆవుల మోహన్‌రెడ్డి బరిలో నిలవగా, ప్రముఖ పారిశ్రామిక కుటుంబం నుంచి టీఎన్.శ్రీనివాసులురెడ్డి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి ఇద్దరు అభ్యర్థులను ఓడించారు.

టీడీపీకి పునాది ఉమాశంకర్‌రెడ్డి

టీడీపీ తరపున తంబళ్లపల్లె రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఉమాశంకర్‌రెడ్డిది ములకలచెరువు మండలంలోని గూడుపల్లె. 1983లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలైనప్పటికి ఎన్టీఆర్ ఆయన్ను ఎమ్మెల్సీ చేశారు. నియోజకవర్గ రాజకీయాల్లో కీలకవ్యక్తిగా మారుతున్న సమయంలో 1984 పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో ఉండగా తంబళ్లపల్లె మండలం అన్నగారిపల్లె వద్ద దారుణహత్యకు గురయ్యారు.

తెరపైకి లక్ష్మిదేవమ్మ



లక్ష్మిదేవమ్మ

భర్త ఉమాశంకర్‌రెడ్డి హత్యతో గృహిణిగా ఉన్న లక్ష్మీదేవమ్మ అనూహ్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. 1985లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా గెలిచి ఎమ్మెల్యే అయ్యారు. 1989 ఎన్నికలో ఓడిపోగా 1994లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచి టీఎన్, కలిచర్ల కుటుంబాలపై పైచేయి సాధించడం అప్పట్లో సంచలనం. అయితే బీజేపీ రూపంలో ఆమె రాజకీయ ప్రస్థానానికి బ్రేక్ పడింది. టీడీపీ–బీజేపీ పొత్తుతో తంబళ్లపల్లె స్థానం 1999, 2004లో బీజేపీకి ఇవ్వడంతో పోటీకి దూరమయ్యారు. 2004 ఎన్నికలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయాక అవే ఆమెకు చివరి ఎన్నికలు.

ఐదేళ్లు గడవకనే అనర్హత

తండ్రి ఉమాశంకర్‌రెడ్డి ఎమ్మెల్సీగా, తల్లి లక్ష్మిదేవమ్మ రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేయగా వీరి కుమారుడు ఏవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఐదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగలేకపోగా 10 ఏళ్లుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ప్రవీణ్ 2009 ఎన్నికతో రాజకీయ ప్రవేశం చేసి టీడీపీ అభ్యర్థిగా పోటిచేసి గెలుపొందారు. తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయికి చేరడం, చంద్రబాబు విభజనకు లేఖ ఇవ్వడాన్ని వ్యతిరేకించిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో చేరగా అప్పటి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల పదవీకాలం పూర్తవకనే అనర్హత వేటు వేసింది. 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలై రాజకీయాలకు దూర మయ్యారు.



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

మెరిసి మసకబారిన శంకర్



శంకర్ యాదవ్

2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగిన జి.శంకర్ యాదవ్..ప్రవీణ్ చేతిలో ఓటమిపాలయ్యారు. తర్వాత బెంగళూరులో వ్యాపారాలతో స్థిరపడ్డారు. 2014లో టీడీపీ తరపున పోటీచేసేందుకు అభ్యర్థి దొరకని పరిస్థితిలో శంకర్‌ను టీడీపీ నేతలు ఒప్పించి పోటీ చేయించగా గెలుపొందారు. 2019 ఎన్నికల్లో పోటీచేసేందుకు శంకర్ పోరాటమే చేయాల్సి వచ్చింది. చివరకు టికెట్ ఇచ్చినా ఓడిపోయారు. 2024లో పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతుండగా ఊహించని విధంగా శంకర్‌ను కాదని రాజకీయాలకు కొత్త వ్యక్తి అయిన జయచంద్రారెడ్డికి టికెట్ కేటాయించడంతో టీడీపీలో శంకర్ ఎపిసోడ్ ముగిసింది.

▶▶ కొత్త అభ్యర్థి మూన్నాళ్ల ముచ్చట

ఊహించని విధంగా టీడీపీ టికెట్ దక్కించుకున్న జయచంద్రారెడ్డికి పోటీ చేసే అవకాశం దక్కలేదు. ఫిబ్రవరి 24న టికెట్ ప్రకటించగా, అప్పటినుంచి పోటీచేసేది నేనే అంటూ ప్రచారం చేసుకున్నారు. అభ్యర్థిత్వ ప్రకటన వెలువడిన రోజునుంచే టీడీపీ క్యాడర్ ఆయనకు వ్యతిరేకమైంది. క్యాడర్‌కు కొత్త కావడం, పరిచయాలు లేకపోవడం, మాజీ ఎమ్మెల్యే శంకర్, సీనియర్ నేతల వ్యతిరేకతతో ఇన్నాళ్లు గడచిపోగా రాజకీయ పరిణామాల నేపథ్యంలో పొత్తులో టికెట్ బీజేపీకి కేటాయించే పరిస్థితి వచ్చింది. ఇదంతా టీడీపీకి తంబళ్లపల్లె అచ్చిరాకపోడమే అని రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

ఊరేగింపులో ఘర్షణ

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని జె వడ్డిపల్లె గ్రామంలో గ్రామ దేవత ఏక వీరమ్మ ఊరేగింపు సందర్భంగా శనివారం జరిగిన ఘర్షణలో జె వడ్డిపల్లె గ్రామానికి చెందిన దేవర చిన్నయ్యకు గాయాలయ్యాయి. ఏక వీరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువస్తుండగా మార్గంమధ్యలో బాణసంచా కాల్చే విషయంపై వివాదం చెలరేగడంతో రాళ్లతో దాడులు చేసుకున్నారు. దీంతో దేవర చిన్నయ్యకు తీవ్ర గాయమైంది. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన శ్రీరాములు భార్య నాగమణి (23) కుటుంబ సమస్యల కారణంగా పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం బంగారు వాండ్లపల్లికి చెందిన ఉత్తన్న కుమారుడు బి.కిరణ్ కుమార్ (22) వ్యక్తిగత కారణాలతో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం బుటకపల్లెకు చెందిన అక్కులప్ప కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్ద పనులు చేసేందుకు వెళ్లారు. టమాట పంటకు మందు పిచికారి చేసేందుకు సిద్ధం చేసే క్రమంలో పురుగుల నివారణ మందు గ్లాసులో ఉంచాడు. అయితే అక్కులప్ప కుమార్తె జి.దివ్య (14) వేసవి తాపంతో గ్లాసులో నీళ్లు ఉన్నాయనుకొని తాగేసింది. దీంతో తీవ్ర అస్వస్థతకు లోనుకాగా వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీలో జోరుగా చేరికలు



గాలివీడు : నూలివీడులో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి



కేవీపల్లె : పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలు



కురబలకోట : ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కలసి మద్దతు ప్రకటించిన టీడీపీ నాయకుడు వైవీ రమణారెడ్డి

సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ.. వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి చేరుతున్నారు. ప్రధానంగా టీడీపీ నుంచి భారీగా వస్తున్నారు. తాజాగా శనివారం జిల్లాలో వైఎస్సార్‌సీపీలో పలు కుటుంబాలు చేరాయి.

గాలివీడు : మండలంలో తెలుగుదేశం పార్టీకి గట్టి దెబ్బే తగిలింది. నూలివీడు, సీసీ పల్లె, గరుగుపల్లె, గుండ్లచెరువు, కొర్లకుంట, అరవీడు, గోపనపల్లె గ్రామాలలోని తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలోకి చేరారు. సుమారు 150 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం నూలివీడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ కండువాను కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. మండలంలో పలు గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీలోకి వలసలు ప్రారంభం కావడంతో.. ఇంకా రమేష్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రోజు వారీగా పార్టీలోకి వచ్చేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారు మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పేదరికం దూరమవుతోందని, రాష్ట్ర సమగ్రాభివృద్ధిని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు ప్రకటించారు.

పార్టీలో చేరిన వారి వివరాలు ఇలా ఉన్నాయి.

- గరగుపల్లె నుంచి మాజీ సర్పంచ్ చిన్నపురెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, బత్తిన ప్రతాప్‌రెడ్డి, బత్తిన రాజశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, జాఫర్, దేరంగుల రామాంజులు, టి.అల్లి, యోగానందరెడ్డి, రవీంద్రరెడ్డి, రామ్‌గోపాల్‌రెడ్డి
- అరవీడులో.. మాదం భాస్కర్‌రెడ్డి, క్రిష్టారెడ్డి
- గోపనపల్లె నుంచి చెన్నారెడ్డి, కుడుమల బయారెడ్డి, రాజారెడ్డి, మల్‌రెడ్డి, బాబురెడ్డి, పలు కుటుంబాలు

నూలివీడు : నారాయణరెడ్డి(చిన్నబుల్లేట్), పాల శ్రీనివాసులు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు విజయలక్ష్మి, మల్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బేల్దార్ శ్రీను, రవి,

కొర్లకుంట : నాగిరెడ్డి, భూషణ్‌రెడ్డి, మిట్టపల్లె మహేష్‌రెడ్డి

చీమలచెరువుపల్లె : సురేంద్రరెడ్డి, చీపాటి క్రిష్టారెడ్డి, రామమోహన్‌రెడ్డి

పందికుంట : శివారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎద్దుల రామక్రిష్టారెడ్డి, ఎద్దుల రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి..

వేంపల్లె : మండలంలోని ఎగువ తువ్వపల్లె, అలిరెడ్డిపల్లె గ్రామాల్లో తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి 50 కుటుంబాలు చేరాయి. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ కుటుంబాలకు శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మదీనపురం, ఫక్కీర్‌పల్లి గ్రామాలకు చెందిన అబ్దుల్‌రహ్మాన్, దస్తగిరి, ఖాదర్‌బాషా, అల్లాబకాష్, పీరా, ముబారక్, కుమ్మరాంపల్లి మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలనను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించడంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవర్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీపల్లె మండలంలో..

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ అంగజాలవారిపల్లె, ఎగువమేకలవారిపల్లె, దిగువమేకలవారిపల్లెకు చెందిన సుమారు 30 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన పార్టీ కండువాలు వేసి సాదర స్వాగతం పలికారు. పార్టీలో చేరిన వారిలో పోతగాని సుధాకర, సురేంద్ర, జయన్న, జయప్ప, రాజయ్య, శ్రీరాములు, రామకొండారెడ్డి, పాలంరెడ్డి నాగిరెడ్డి, మేకల నాగిరెడ్డి, సిరిపురి మణికంఠ, బాలరాజు, నాగభూషణ, నాగప్రవీణ్, వెంకటేశ్వర్లు, గంగయ్య, యల్లయ్య తదితరులు ఉన్నారు. సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, నాయకులు ద్వారకనాథరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, వారాధిరెడ్డి, సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెంకటరమణారెడ్డి, యువజన కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ దంపతుల మద్దతు

కురబలకోట : టీడీపీకి కురబలకోట గ్రామంలో షాక్ తగిలింది. ఆ గ్రామ మాజీ టీడీపీ ఎంపీటీసీ వైవీ నిరుపమ, ఆమె భర్త టీడీపీ నాయకుడు వైవీ రమణారెడ్డి శనివారం వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తంబళ్లపల్లెలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని కలిసి తాము వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం పని చేస్తామని చెప్పారు. సీఎం జగన్ పాలన, ప్రభుత్వ పథకాలు నచ్చి టీడీపీకి గుడ్ బై చెప్పినట్లు వారు తెలిపారు. త్వరలో పార్టీలో చేరుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనసానివారిపల్లె వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ముదివేటి ఆనందరెడ్డి, కంటేవారిపల్లె శేఖర్ పాల్గొన్నారు.

స్థల వివాదంలో దాడి



గాయపడిన సరోజమ్మ

మదనపల్లె : స్థల వివాదం కారణంగా జరిగిన దాడిలో ఐదుగురు గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. అనపగుట్టకు చెందిన వెంకటరమణ భార్య సరోజమ్మ(55)కు కోళ్ల బైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీ రంగనాథ పెట్రోల్ బంక్ వెనక వైపున భూమి ఉంది. అయితే స్థానికంగా ఉన్న వెంకటరమణ ఆచారి బ్రహ్మంగారి గుడి కట్టేందుకు కొంత స్థలం ఇవ్వాలని కోరడంతో, సరోజమ్మ దంపతులు సమ్మతించి కొంత స్థలం ఇచ్చారు. ఈ క్రమంలో వెంకటరమణ ఆచారి పూర్తి స్థాయిలో భూమి తనదేనంటూ ఆక్రమించుకున్నాడు. శుక్రవారం సాయంత్రం భూమి వద్దకు సరోజమ్మతోపాటు కుటుంబ సభ్యులు రమాదేవి (33), చంద్రబాబు (35), అనురాధ (50), నాగేంద్ర (35) కలిసి వెళ్లారు. భూమి ఎలా ఆక్రమించుకుంటా అంటూ వారు వెంకటరమణ ఆచారిని ప్రశ్నించడంతో వివాదం మొదలైంది. దీంతో వెంకటరమణ ఆచారి యశ్వంత్, మరో నలుగురితో కలిసి సరోజమ్మ కుటుంబ సభ్యులపై దాడి చేశారు. దాడిలో సరోజమ్మ తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు రమాదేవి చంద్రబాబు అనురాధ నాగేంద్రలకు గాయాలయ్యాయి. స్థానికులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో వెంకటరమణాచారికి సైతం స్వల్ప గాయాలయ్యాయి. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బైక్ ఢీకొని వృద్ధుడి మృతి



మృతి చెందిన శ్రీరాములు

పీలేరు రూరల్ : బైక్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలోని తిమ్మారెడ్డి క్రాస్ వద్ద చోటు చేసుకుంది. వివరాలిలా వున్నాయి. పీలేరు పట్టణం కామాటంపల్లెకు చెందిన శ్రీరాములు(71) తన ఇంటి నుంచి పట్టణంలోని పాతబస్టాండ్‌కు నడుచుకుంటూ వెళ్తుండగా తిమ్మారెడ్డి క్రాస్ వద్ద ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆయన్ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్యం ఆటపాటలతో సాగాలి



మాట్లాడుతున్న సినీ హాస్య నటుడు సప్తగిరి

కడప కల్చరల్ : బాల్యమంతా ఆటపాటలతో సాగి మధురమైన స్మృతిగా మలుచుకోవాలని, విద్యతోపాటు మానసిక, శారీరక వికాసానికి ప్రాధాన్యతనివ్వాలని ప్రముఖ సినీ నటుడు సప్తగిరి అన్నారు. కడప నగరం బళ్లారి రోడ్డులోని నజీముల్ అమీన్ పబ్లిక్ స్కూలులో ఎలిమెంటరీ, హైస్కూలు విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన పలుపోటీలలో విజేతలకు శనివారం బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సప్తగిరి మాట్లాడుతూ తనకు ఆటలంటే చాలా ఇష్టమని, దీనివల్ల శారీరక దృఢత్వం, దాని ద్వారా మానసిక వికాసం ఉంటాయని, అలాంటపుడే చదువు బాగా వంట బట్టగలదని, జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందని, అన్ని అంశాలలో చురుగ్గా ఉండవచ్చని తెలిపారు. పిల్లలను బహుముఖ ప్రజ్ఞావంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. యువ సినీ హీరో ఆసిఫ్‌ఖాన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు, యువత వారితో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా పెద్దదర్గాలో ప్రార్థనలు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చీకలబైలు రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా కర్ణాటక రాష్ట్రం ఎలక్ట్రానిక్ సిటీకి చెందిన గవి సిద్ధప్ప కుమారుడు కొప్పుల రాజప్ప (29) కర్ణాటకకు చెందిన 12 బీరు బాటిల్స్ అక్రమంగా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. మద్యం విలువ సుమారు రూ.2160 ఉంటుందన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు.

వాహనాల తనిఖీ

లింగాల : మండలంలోని పార్నపల్లె చెక్‌పోస్టు వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. బాలకృష్ణ అనే వ్యక్తి నుంచి రూ.2.30 లక్షలు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు. అతను అరటికాయల వ్యాపారం చేస్తున్నాడని, అయితే నగదుకు సంబంధించి ఎలాంటి బిల్లులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు. బిల్లులను చూపించిన తర్వాత తిరిగి చెల్లిస్తామని వివరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో అలంఖాన్‌పల్లి రాణితోపు సమీపంలో రెండు రోజుల క్రితం వంశీ అనే యువకుడు, తన స్నేహితులతో కలిసి తిరుపతి సురేంద్ర అలియాస్ జాకీపై బీర్ బాటిళ్లతో దాడి చేశారు. ఈ సంఘటనలో బాధితుడు తీవ్రగాయాలపాలై ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వీరికి గతంలో మనస్పర్థలున్నాయని పోలీసుల విచారణలో తేలింది. ఈ సంఘటనలో మరి కొంత మంది పాత్రపై పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో ప్రధాన నిందితుడైన వంశీని అరెస్ట్ చేశారు. ఇంకా బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కడప తాలూకా సీఐ తిమ్మయ్య తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మృత్యుంజయకుంటలో నివాసం వుంటున్న దూదేకుల కుళ్లాయప్ప భార్య ఉదయగిరి కుళ్లాయమ్మ (20) అనే వివాహిత ఇంటిలో ఎవరూ లేని సమయంలో మనస్తాపంతో శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. అనంతపురానికి చెందిన దూదేకుల కుళ్లాయప్పకు, కడప నగరంలోని మృత్యుంజయకుంటకు చెందిన ఉదయగిరి వాహిదా కుమార్తె కుళ్లాయమ్మతో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 11 నెలల కుమారుడు వున్నాడు. వీరు ఇక్కడే నివసిస్తున్నారు. ఈ నెల 12వ తేదీన రాత్రి తన భార్యతో గొడవపడిన భర్త, తన కుమారుడిని వెంటపెట్టుకుని అనంతపురం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ఆమె దగ్గరలోని తన తల్లి నివాసం వుంటున్న ఇంటికి వెళ్లింది. రేకుల ఇంటిలో వున్న ఇనుప పైపునకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ చేస్తున్నట్లు చిన్నచౌక్ సీఐ నరసింహారెడ్డి, ఎస్‌ఐ రవికుమార్ తెలియజేశారు.

బాబు మోసం మాటలను జనం నమ్మరు

వైఎస్సార్‌సీపీ నేత గంటా నరహరి



సుండుపల్లెలో ఆకేపాటికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న గంటా నరహరి

రాజంపేట : సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మోసపు మాటలను జనం నమ్మే పరిస్థితిలో లేరని వైఎస్సార్‌సీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా నరహరి అన్నారు. శనివారం నియోజకవర్గంలోని సుండుపల్లె మండలంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి చేపట్టిన ప్రచారానికి మద్దతుగా గంటా పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాలకు మేలు చేకూరే విధంగా జగనన్న పాలన కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో పేదవర్గాల అభ్యున్నతి కోసం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు తిరిగి అందాలంటే మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. కూటమితో ప్రజల వద్దకు వస్తున్న పాత్త పార్టీలను నమ్మరాదన్నారు. మేమంతా సిద్ధంకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. ప్రజలు చంద్రబాబు మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, వేయించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అజంతమ్మ, మండల కన్వీనరు రామస్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనరు రెహమాన్‌ఖాన్, సింగిల్ విండో మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు యర్రప్పరెడ్డి అజంతారాణి, సంయుక్త కార్యదర్శి ఆరంరెడ్డి, నాయకులు భానుప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ ఇస్మాయిల్, బేరిపల్లె రఫీక్, మైనార్టీ నాయకులు రహీంబాషా, కలీంబాషా, సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులు, మండల నేతలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



గాయపడిన ఆరిఫ్

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు వ్యక్తులు గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన ఆరిఫ్ (23), ఆసిఫ్ (22) ద్విచక్ర వాహనంలో బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌కు బయలుదేరారు. మార్గంమధ్యలోని బి.కొత్తకోట వద్ద బైక్ వేగాన్ని అదుపు చేయలేక కింద పడ్డారు. ప్రమాదంలో ఆరిఫ్ తీవ్రంగా గాయపడగా ఆసిఫ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు బాధితులని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆరిఫ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. నిమ్మనపల్లె మండలం వెంగళవారి పల్లికు చెందిన నరసింహులు(43) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో శనివారం నిమ్మనపల్లెకు వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా తవళం రోడ్డులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పిటిఎం మండలం కుమ్మరి కుంట పంచాయతీ బొమ్మకపల్లెకు చెందిన భార్యాభర్తలు శంకర, శారదమ్మ (35), ద్విచక్ర వాహనంలో వస్తుండగా మార్గంమధ్యలోని నవాబు కోట వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శారదమ్మ తీవ్రంగా గాయపడగా, 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

తేనెటీగల దాడిలో గాయపడిన వ్యక్తి మృతి



రామచంద్ర (ఫైల్)

బి.కొత్తకోట : తేనెటీగల దాడిలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బి.కొత్తకోట మండలం గుమ్మసముద్రం పంచాయతీ కొత్తపల్లెకు చెందిన కె.రామచంద్ర (65), భార్య ప్రమీలమ్మ (58)లు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి సొంత చింతచెట్లలో చింతకాయలను రాల్చేందుకు శుక్రవారం మధ్యాహ్నం గ్రామానికి సమీపంలోని చింతచెట్ల వద్దకు వెళ్లారు. రామచంద్ర చింతమాను ఎక్కి కాయలను రాల్చేందుకు కొమ్మలను ఊపడంతో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. తేనె తుట్టెను గమనించకపోవడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. తేనెటీగల దాడి నుంచి తప్పించుకునేందుకు రామచంద్ర చెట్టుపై నుంచి కిందకు వచ్చాడు. అప్పటికే కింద ఉన్న భార్య ప్రమీలమ్మ పైనా తేనెటీగలు దాడి చేస్తున్నాయి. వాటి బారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఒళ్లంతా తేనెటీగల కాట్లు పడటంతో బాధితులను స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు చికిత్సలు అందించి 108 ద్వారా మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు రామచంద్ర పరిస్థితి విషయంగా ఉందని గుర్తించి తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. అప్పటికప్పుడు రామచంద్రను తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు గ్రామస్తులు తెలిపారు. గాయాలకు గురైన భార్య ప్రమీలమ్మ మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది.

వైఎస్ కుటుంబంలో చీలిక తెచ్చిన బాబు

- షర్మిల నోటి వెంట వస్తున్న ప్రతిమాట బాబు స్క్రిప్టు మేరకే
- డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : వైఎస్ కుటుంబంలో చీలిక తెచ్చిన ఘనత ప్రతిపక్షనేత చంద్రబాబుకే దక్కుతుందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. శనివారం కడపలోని వైఎస్సార్ కాలనీలో ఎన్నికల ప్రచారాన్ని పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ కె.సురేష్‌బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగనన్న పాలనలో సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. నమ్మించి మోసం చేసే చంద్రబాబు ఒక వైపు, నమ్మిన వారి కోసం ఎందాకైనా వెళ్లే వైఎస్ జగన్ మరోవైపు ఉన్నారని, ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. వైఎస్ కుటుంబంలో చీలిక తెచ్చిన ఘనత చంద్రబాబుదేనని, షర్మిల నోటి నుంచి వస్తున్న ప్రతి మాట బాబు స్క్రిప్టు మేరకే వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరిముల్లా, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, పార్టీ నాయకులు అహ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, బంగారు నాగయ్య, శ్రీరంజన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, షఫీ, దాసరి శివప్రసాద్, వేణుగోపాల్ నాయక్, సీహెచ్ వినోద్, డాక్టర్ శివానాయక్, సమరనాథరెడ్డి, మున్నా, పస్తం అంజి, పవర్ అల్తాఫ్, కె.రాజశేఖర్‌రెడ్డి, ఏ.బాలక్రిష్టారెడ్డి, బాలస్వామిరెడ్డి, లక్ష్మీనారాయణ, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

భర్త గెలుపు కోసం బైక్‌పై కూర్చొని..



తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సతీమణి పెద్దిరెడ్డి కవితమ్మ ప్రచారంలో దూసుకుపోతున్నారు. భర్త గెలుపుకోసం శనివారం నుంచి కురబలకోట మండలంలోని తెట్టు గ్రామంలో ప్రచారం చేపట్టారు. గట్లమీద పల్లెల ప్రచారంలో భాగంగా వాహనాలు వెళ్లలేని గుట్ట ప్రాంతాల్లోని ఇళ్లకు సైతం టూవీలర్‌పై వెనుక కూర్చుని వెళ్లి ప్రచారం చేయడం విశేషం.

–కురబలకోట